భద్రత పటిష్టం చేయాలి



ప్రస్తుత పరిస్థితులు గతానికి పూర్తిగా భిన్నంగా మారిపోయాయి. రాత్రి వేళల్లో పీహెచ్‌సీలో డ్యూటీ చేయాలంటే భయం భయంగా ఉంటుంది. ఏ చిన్న సంఘటన జరిగినా వైద్యులను, సిబ్బందిని బాధ్యులుగా భావించి దాడులకు పాల్పడుతున్నారు. మరో వైపు రోగుల సహాయకులుగా వస్తున్న కొంత మంది ప్రవర్తన కూడా ఇబ్బందిగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో రాత్రి డ్యూటీ అంటే భయంగానే చేయాల్సి వస్తోంది. అందువల్ల రాత్రి పూట మహిళా పోలీసులను బందోబస్తుగా ఉంచితే బాగుంటుంది.

– హసీనా, స్టాఫ్ నర్స్, గాజువాక

పోలీసుల పర్యవేక్షణ పెరగాలి



ఏ ఆస్పత్రిలోనైనా వైద్య, ఆరోగ్య సిబ్బంది కోసం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి. దీనికోసం పోలీసుల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని. రోగులతో పాటు వచ్చేవారిలో కొంతమంది బాధ్యత రహితంగా ఉంటారు. మరి కొంతమంది బెదిరిస్తుంటారు కూడా. ఇలాంటి పరిస్థితుల నుంచి రక్షణ ఉండే విధంగా పోలీసులను అందుబాటులో ఉంచితే ధైర్యంగా ఉద్యోగం చేయగలం. ఆ విధంగా చర్యలు తీసుకొని భరోసా కల్పించాలి.

– అంజలి, స్టాఫ్ నర్స్

క్లుప్తంగా

ధనుర్బాణ దర్శనం.. పులకించిన భక్తులు



వెండి ధనుర్బాణం వద్ద అర్చకులు, భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అయోధ్య శ్రీరామ చంద్రస్వామి ధనుర్బాణాన్ని దర్శించుకున్నారు. అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించనున్న వెండి ధనుర్బాణాన్ని సోమవారం భక్తుల దర్శనార్థం వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకు వచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముడు, వేంకటేశ్వరస్వామి విగ్రహాల వద్ద కొద్దిసేపు ఉంచారు. అనంతరం మండపంలో ఏర్పాటు చేసిన ధనుర్బాణాన్ని భక్తుల దర్శించుకుని తీర్థ ప్రసాదా లు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్ స్వామి, హరినారాయణ స్వామితో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల సొత్తు



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఇంటక్ నాయకులు, పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు ఆంధ్రుల సొత్తు అని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రజ లు ప్రాణాలు, భూములు త్యాగం చేస్తే ఏర్పా టు చేసిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభు త్వం తన ఇష్టమొచ్చినట్టు పెత్తనం చెలాయిస్తే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. సమయం వచ్చినప్పుడు విప్లవంలా తిరుగుబాటు తప్పదన్నారు. కేంద్రం తన వైఖరి మార్చుకొని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, సుబ్బయ్య, వరసాల శ్రీనివాసరావు, పి.వి.రమణమూర్తి, ఎస్.వై. నాయుడు, దేముడు, కారు రమణ, మంత్రి నారాయణ, గోపాలరాజు, గంగవరం గోపి, కొమ్ము ప్రసాద్ పాల్గొన్నారు.

మేడపై నుంచి పడి యువకుడి మృతి



రామ్‌దిన్ ఫైన్‌కార్ మృతదేహం

పెదగంట్యాడ: మేడపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, జాస్‌పూర్ జిల్లా, బేంగూ గ్రామానికి చెందిన రామ్‌దాస్ ఫైన్‌కార్ (25) తన సోదరుడు అలికేస్వాన్ ఫైన్‌కార్‌తో కలసి మండలంలోని గొడ్డువానిపాలెంలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే ఆదివారం విశాఖపట్నం పోర్టులో పని చేసుకుని రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. తర్వాత వారిద్దరూ మిత్రులతో కలసి మద్యం సేవించారు. ఆ తర్వాత వారంతా ఆ ఇంటి మేడమీద నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వర్షం పడడంతో అలికేస్వాన్ ఫైన్‌కార్‌తో అక్కడ పడుకున్న వారిని నిద్రలేపి కిందకు వెళ్లిపోయాడు. రామ్‌దాస్ ఫైన్‌కార్ మాత్రం మేడపైనే ఉండిపోయాడు. సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో మేడపైకి వెళ్లి చూడగా రామ్‌దాస్ పక్కనున్న మేడపై పడి మృతి చెంది ఉన్నాడు. దీంతో వెంటనే న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అలికేస్వాన్ ఫైన్‌కార్ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ దాలిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



88వ వార్డు జగ్గరాజుపేటలో పూజల్లో కోమటి శ్రీనివాసరావు



బ్రహ్మకుమారీలతో గోపికలు, చిన్ని కృష్ణులు



అగనంపూడి పినమడకలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



చట్టివానిపాలెంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు

హే కృష్ణా.. మురారీ

- కొలువుదీరిన చిన్నికృష్ణులు
- కనులపండువగా కృష్ణాష్టమి
- ఆలయాల్లో ఘనంగా వేడుకలు

నందనందనుడు ప్రతీ ఇంటా కొలువుదీరాడు. కృష్ణాష్టమి పర్వదినాన గృహాలు నందనవనాలయ్యాయి. ఆలయాలన్నీ బృందావనాలను తలపించాయి. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం కనుల పండువగా నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణల్లో చిన్నారులు కనువిందు చేశారు. చిన్ని కృష్ణుడికి ప్రీతిపాత్రమైన పాలు, పెరుగు, వెన్నను నివేదించి, ఉట్టి సంబరాలు నిర్వహించారు.



శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు





ముచ్చట గొల్పుతున్న చిన్నారులు



ఉక్కు సృష్టి వరల్డ్ పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో బాలబాలికలు

గాజువాక: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గాజువాక నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాజువాక మెయిన్ రోడ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష అలంకరణలో దర్శనమిచ్చిన స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం ఉట్టి కొట్టే సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నవారిలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్ తదితరులున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉరుకూటి అప్పారావు, కమిటీ సభ్యులు గొలగాని అప్పారావు, ఉరుకూటి బాబూరావు, నూకరాజు, కనకరాజు, శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- 70వ వార్డు చట్టివానిపాలెంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, గ్రామ పెద్దలు చట్టిబాబు, చట్టి అప్పలరాజు, ఏదూరి తమ్మినాయుడు, చట్టి కామరాజు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక సెలెస్ట్ గేటెడ్ కమ్యూనిటీలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి పండగను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెలెస్ట్ రెసిడెంట్స్ అసోసియేషన్లు, కల్చరల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగనంపూడి: శ్రీకృష్ణాష్టమి వేడుకలను జీవీఎంసీ 85, 86, 87 వార్డుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కణితి యాదవ వీధి, 86వ వార్డు రాసాలమ్మకాలనీ, 85వ వార్డు దిబ్బపాలెంలో నిర్వహించినే వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, యలమంచిలి అప్పారావు, బొట్ట అప్పలస్వామి, పిన్నింటి సంతోష్, ఆడారి శ్రీను, చిత్రాడ వెంకటరమణ, పాల్గొన్నారు.

- 87వ వార్డు కణితి యాదవ వీధి, అప్పికొండ, జగ్గరాజుపేట, అగనంపూడిలో నిర్వహించిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- అగనంపూడి సెక్టార్–3 దిబ్బపాలెం శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ యలమంచిలి పెద అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, ఆశాలత, కె.తాతారావు, ఎ.ఈశ్వరరావు పాల్గొన్నారు.
- అగనంపూడి సెక్టార్–1 పినమడక కృష్ణ మందిరంలోఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, జలాభిషేకం చేశారు. తరువాత నూతన వస్త్రాలతో అలంకరింపజేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి సంబరం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు చటి పెంటయ్య దంపతులు, నూకరాజు, ధనబాబు, గౌరినాయుడు పాల్గొన్నారు.
- దువ్వాడ సమీపంలోని కుసుమ హరనాథ్ ఆశ్రమంలో జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.
- 85వ వార్డు అగనంపూడి చట్టివానిపాలెంలో శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు కనుల పండువగా జరిపించారు. వార్డులోని ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ, సెక్టార్–1ల్లో పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తీక్ సారథ్యంలో పూజలు నిర్వహించారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు ముసలినాయుడుపాలెంలోని వంశీకృష్ణ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కిల్లాన ముసలయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రామ్మోహన్, శ్రీను, శంకరరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లి సత్యంబాబు,వైస్ చైర్మన్ రవిశేఖర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఉక్కునగరం: స్థానిక సృష్టి వరల్డ్ పాఠశాలలో బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక, యశోద వేషధారణలో అలరించారు. ఉట్టి కొట్టడం వంటి అంశాలతో ఆహుతులను అలరించారు. సృష్టి వరల్డ్ పాఠశాలలో డైరెక్టర్ పి. సుశీలారాణి, ప్రిన్సిపాల్ చంద్రిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీకృష్ణుడిని విశేషంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటం చేశారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ పాల్గొన్నారు.

నంద నందనా గోపాల .. నవనీత చోర

అక్కిరెడ్డిపాలెం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను బ్రహ్మకుమారీస్ షీలానగర్ బ్రాంచ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగిన వేడుకల్లో ముందుగా శ్రీకృష్ణునికి పూజలు చేశారు. కార్యక్రమంలో షీలానగర్ పరిసర ప్రాంతాల పాఠశాలలకు చెందిన చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మింది జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్. ఆంజనేయ, బ్రహ్మకుమారీలు సోమేశ్వరి, శశి, శ్రీదేవి, మమత తదితరులు పాల్గొన్నారు.



85వ వార్డు దిబ్బపాలెంలో స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు



గాజువాక వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణ



చట్టివానిపాలెంలో శ్రీకృష్ణుడికి ఊయల సేవ



సెలెస్ట్‌లో వేడుకల్లో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు



నమ్మిదొడ్డిలో పూజలు చేస్తున్న కాకి బాబు, శ్రీను

ముఖాముఖి అర్జీల పరిష్కారంపై దృష్టి


- అప్పికొండకు సిటీ బస్ సర్వీస్ కొనసాగింపు
- బీచ్‌లో గస్తీ పెంపు
- సీఐ ఎర్రంనాయుడు



సిటీ బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద గంట్యాడ శివారు గ్రామాల్లో నగర పోలీస్ కమిషనర్ ఇటీవల నిర్వహించిన ముఖా ముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఆర్జీల పరిష్కారానికి కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ తుహిన్ సిన్హా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సౌత్ ఏసీపీ టి. త్రినాథ్ పర్యవేక్షణలో వినతుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు చెప్పారు. సిటీ బస్ సౌకర్యం కొనసాగించాలని 30 వరకు అర్జీలు అందిచారని, ఈమేరకు నగర పోలీస్ కమిషనర్ ప్రజారవాణాశాఖ ఎండీతో చర్చించి బస్ కొనసాగేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతీ రెండు గంటలకు ఒక సర్వీస్ నడిపేందుకు స్టీల్‌సిటీ డిపో ముందుకు వచ్చిందన్నారు. అలాగే వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ప్రజలు సీపీ దృష్టికి తీసుకురావడంతో వెంటనే హిందూజా, మెడ్‌టెక్ జోన్ల యాజమాన్యాలతో పాటు జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించినట్టు చెప్పారు. వీధి దీపాలు, సీసీ కెమెరాలు మరో రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే అప్పికొండ బీచ్‌కు పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో రోజూ ఉదయం, రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ పెంచామన్నారు. వీకెండ్, సెలవు రోజుల్లో ఇద్దరు ఎస్ఐలు, మరో ఐదుగురు సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు.

వర్షానికి కూలిన చెట్టు



చిననడుపూరు రోడ్డులో కూలిన చెట్టు

పెదగంట్యాడ: ఎడతెరిపి లేకుండా ఆదివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా చిననడుపూరు నూకాలమ్మ ఆలయ సమీమంలో ప్రధాన రహదారిపై చెట్టు నేలి కూలింది. ఆదివారం ఉదయం నుంచి భానుడు నిప్పులు కురిపించాడు. సాయంత్రం వరకూ ఎండ వేడితో జనం అల్లాడిపోయారు. రాత్రి 10 గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆపై చల్లని గాలులు ప్రారంభం కాగా.. అటుపై తెల్లవారెవరకూ వర్షం కురిసింది. ఈ సమయంలో గాలులు వీయడంతో వుడాకాలనీ నుంచి చిననడుపూరు వెళ్లే రోడ్డులో ఓ చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు.. సెలవు దినం కావడంతో ఆ చెట్టును అధికారులు ఎవరూ తొలగించలేదు..దీంతో స్థానికుల అవస్థలు పడ్డారు.చెట్టు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాఖ సిటీ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఉద్యోగులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఉద్యోగులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి ఇటువంటి స్పోర్ట్స్ మీట్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం



అగనంపూడి ఆస్పత్రిలో ఉత్తమ స్టాఫ్ నర్స్ లీలావతిని సత్కరిస్తున్న ప్రజా సంఘాలు



మదర్ థెరిసా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: మానవ సేవే మాధవ సేవ అని, కుష్టు రోగులను సైతం అక్కున చేర్చుకున్న మానవతామూర్తి మదర్ థెరిసా అని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద మదర్ థెరిసా జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, రోజారాణి, పిట్టా రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, గొందేశి వెంకట రమణారెడ్డి, దాలినాయుడు, మంత్రి శంకర నారాయణ, పల్లా పెంటారావు, అప్పలరెడ్డి, తిప్పల స్వాతి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, గొందేశి రాము, కణితి శివకుమార్ పాల్గొన్నారు.

మానవతా మూర్తి మదర్ థెరిసా

అగనంపూడి: వాత్సల్యం, ప్రేమ,కరుణ, దయకు మారుపేరుగా నిలిచిన నోబెల్ అవార్డు గ్రహీత మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకమని అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి. ఉష అన్నారు. మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు రోగులు, బాధితులను అక్కున చేర్చుకొని వారికి సేవలు అందించిన థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తికే వన్నె తెచ్చిన ఆమె విశ్వమాతగా కీర్తి పొందారన్నారు. అనంతరం ఉత్తమ స్టాఫ్ నర్స్‌గా అవార్డు పొందిన లీలావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు గోపాలకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, హెడ్ నర్స్ భారతి లక్ష్మి, అగనంపూడి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు ఐ.రామ్‌గోపాల్, డాక్టర్ వి.వి.రామారావు, గురు గోవిందరావు, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కోసూరి తాతారావు, పులగపూరి ఆశాలత పాల్గొన్నారు.

పాత అగనంపూడిలో..

79వ వార్డు పాత అగనంపూడి దరి సత్రం కూడలిలోని థెరిసా విగ్రహానికి పూలమాల వేసి మహాత్మాగాంధీ సేవా సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు, వివిధ సంఘాల నాయకులు కరణం సత్యారావు, కోసూరి తాతారావు, అంగులూరి ఈశ్వరరావు, ఆశాలత, వి.వి.రామారావు, నాగేశ్వరరావు, చిత్తా జానకీదేవి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ రామ్మోహన్ కోరారు. గాజువాకలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. ఈ నెల 25న ప్రారంభమైన బీజేపీ తొలివిడత సభ్యత్వ నమోదు వచ్చేనెల 3వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా గంగయ్య, కరణంరెడ్డి నర్సింగరావు, బాటా శ్రీనివాసరావు, రంగనాయకులు, తేజశ్విని, నాగరాజు, విశ్వనాథం, వెంకట రమణ, లత పాల్గొన్నారు.